క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): స్థానిక సత్రంపాడు లక్ష్మీ గణపతి స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. సంకట హర చతుర్థి సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవ మూర్తికి ఏకరుద్రాభిషేకం, విశేష అలంకరణ చేశారు. తూములూరి విశ్వనాథ శాస్త్రి యాజ్ఞికం నిర్వహించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

20 నుంచి జాతర మహోత్సవాలు


నూకాలమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ 45వ కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు ఈనెల 20 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ దావాలా రంగ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల అనంతరం ఏప్రిల్ 6వ తేదీ ఆదివారం భారీ అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కమిటీ ప్రతినిధి జంపా సూర్యనారాయణ, ప్రధాన అర్చకులు మంత్రవాది రామ కృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ


లోకేష్‌ను పరామర్శిస్తున్న జేపీ తదితరులు

ఏలూరు (టూటౌన్): అస్వస్థతతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు మాచర్ల లోకేష్‌ను ఆ పార్టీ ఏలూరు అసెంబ్లీ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) సోమవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసు, మాజీ డిప్యూటీ మేయర్ నుకపెయ్యి సుధీర్ బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, నగర అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శి గాజుల బాజీ, ఆర్టీఏ విభాగ అధ్యక్షుడు మద్దాల ఫణి, డాక్టర్స్ విభాగ అధ్యక్షులు కొవ్వాడ దుర్గారావు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవా!

- ముందు చూపు లేని పాలకులు
- దెందులూరు ఎస్ఎస్ ట్యాంకులో సగానికి కూడా చేరని నీరు
- సీలేరు నుంచి జలాలు రప్పించిన గత పాలకులు


దెందులూరు వద్ద ఎస్ఎస్ ట్యాంకులో అడుగంటిన నీరు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర వాసులకు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవు. ఇందుకు దెందులూరు చెక్‌పోస్టు సమీపంలో 110 ఎకరాల్లో నిర్మించిన చెరువులో నీరు అడుగంటడమే కారణం. ఈ చెరువును పూర్తిగా గోదావరి జలాలతోనే నింపాల్సుంది. జనవరి నెల నుండే చెరువులో నీటిని తోడేందుకు గతంలో పాలకులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసేవారు. దానికి భిన్నంగా ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేయడం, ముందస్తు ప్రణాళిక లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. మార్చి నెల వచ్చే వరకు తాగునీటి చెరువుకు నీటిని మళ్లించే ప్రాంతంలో వ్యర్థాలను తొలగించడం, తూడు, గుర్రపుడెక్క వంటివి తొలగించి నీరు సాఫీగా ప్రవహించే వెసులు బాటు కల్పించడంలో విఫలమయ్యారు. మరో నెల రోజుల్లో కాల్వలు కట్టేయనుండటంతో ఇప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

నీటి నిల్వలు పెంచాలి

ఏలూరు నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు దెందులూరు సమీపంలో 110 ఎకరాల్లో చెరువును నిర్మించారు. దీని పూర్తిసామర్థ్యం 18 మీటర్లు కాగా ప్రస్తుతం 6 మీటర్లు వరకే నీరు ఉందని చెబుతున్నారు. కనీసం నీటి నిల్వలు 16 మీటర్లు ఉంటేనే వేసవిలో 60 నుంచి 70 రోజులు నగర వాసుల తాగునీటి అవసరాలు తీరతాయి. అంటే మరో 10 మీటర్ల మేర నీటి నిల్వలను పెంచాల్సిన ఆవశ్యకత ఉంది.

ఇంజిన్లతో నీటి తోడకం

గోదావరి – ఏలూరు డెల్టా కాలువ పరిధిలోని సాగు భూములకు నెలాఖరు వరకు నీటిని అందించాల్సి ఉంది. పూర్తిస్థాయిలో నీరు అందకపోడంతో రైతులు వంతులు వేసుకుని సాగు నీటిని మళ్లించుకుంటున్నారు. దీంతో కాలువకు శివారున ఉన్న దెందులూరు ఎస్ఎస్ ట్యాంకులోకి పూర్తిస్థాయిలో నీటిని తోడేందుకు కొంత సమస్య ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు మోటరు ఇంజిన్లు బిగించి చెరువులోకి కాల్వ నీటిని తోడుతున్నారు.


గోదావరి - ఏలూరు కాలువలో తక్కువగా ఉన్న నీటి మట్టం


ఏలూరు కాలువ నుంచి మోటార్లతో నీరు తోడుతున్న దృశ్యం

పనిచేయని మోటారు

దెందులూరు తాగునీటి చెరువులోకి నిత్యం నీటిని లిఫ్ట్ చేసేందుకు వినియోగించే విద్యుత్ మోటార్ కొద్ది రోజుల క్రితం వరకు పనిచేయలేదు. దీన్ని ఆలస్యంగా గుర్తించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక విద్యుత్ మోటార్లను బిగించారు. ఈ సమస్యను ముందుగానే గుర్తించి నివారణా చర్యలు తీసుకుంటే తాగు నీటి చెరువులో నీటి మట్టం ఇంత దిగువకు పడిపోయి ఉండేది కాదని ఇరిగేషన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

డెడ్ స్టోరేజీ

ఎస్ఎస్ ట్యాంకు కెపాసిటీ 18 మీటర్లు కాగా, ఎప్పుడూ 10 మీటర్లకు తగ్గకుండా నీటి నిల్వలు ఉండేవి. ఆవిధంగా గతంలో పనిచేసిన అధికారులు, పాలకులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండేవారు. ఇప్పుడు ఎన్నడూ లేని విధంగా మార్చి మొదటి వారానికి ట్యాంక్ నీటి నిల్వలు నాలుగు మీటర్లకు పడిపోయాయి. పది రోజుల నుంచి నీటిని లిఫ్ట్ చేస్తుండటంతో నీటి నిల్వలు ఆరు మీటర్ల స్థాయికి చేరుకున్నాయి. మరో 10 మీటర్ల మేరకు నీటి నిల్వలు పెరగక పోతే ముందు వేసవిలో ఏలూరు నగర వాసులు తాగు నీటి కోసం అల్లాడాల్సిన దుస్థితి నెలకొంటుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో సీలేరు జలాలతో దాహార్తిని తీర్చారు

వైఎస్సార్ సీపీ హయాంలో తాగు నీటి చెరువులో నీటి నిల్వలు కొద్ది మేర తగ్గిపోయాయి. దీన్ని గుర్తించిన నాటి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంతో ప్రత్యేకంగా మాట్లాడి సీలేరు జలాలు రోజుకు 800 క్యూసెక్కులను విడుదల చేయించి చెరువును పూర్తిస్థాయిలో నింపిన విషయాన్ని వాసులు గుర్తు చేసుకుంటున్నారు. ఆ విధమైన చొరవ ప్రస్తుత పాలకులు, అధికారులు చూపకపోవడం పట్ల నగర వాసులు విస్తుపోతున్నారు.

గోదావరి జలాలను లిఫ్ట్ చేస్తున్నాం



దెందులూరు వద్ద తాగు నీటి ట్యాంకుకు గత కొద్ది రోజుల నుంచి గోదావరి జలాలను లిఫ్ట్ చేస్తున్నాం. ఏప్రిల్ ఒకటి నుంచి 15 వరకు మంచినీటి చెరువుకు గోదావరి – ఏలూరు కాల్వ ద్వారా నీటిని విడుదల చేయనున్నాం. అప్పటికీ చెరువు నిండక పోతే మరి కొద్ది రోజులు నీటిని నింపే కార్యక్రమం చేస్తాం. ప్రతి రోజూ చెరువును పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.భాను ప్రతాప్, కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలి



వేసవిలో నగర వాసులకు పూర్తిస్థాయిలో తాగు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి, సమస్య రాకుండా అవసరమైన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే నగరంలోని ప్రజలు చాలా మందికి మినరల్ వాటరే ఆధారమవుతుంది. పేదలకు అవసరమైన మున్సిపల్ వాటర్‌ను కార్పొరేషన్ విధిగా సరఫరా చేయాలి.

– బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

రేపు జాబ్ మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ కళాశాల (స్కిల్ హబ్)లో ఈ నెల 19న జాబ్ మేళ నిర్వహించనున్నట్టు డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీస్, సీఎంఆర్ టెక్స్‌టైల్స్ – జ్యువలరీ, బజాజ్ క్యాపిటల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 58 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 94934 82414, 90302 27668, టోల్ ఫ్రీ 99888 53335లో సంప్రదించవచ్చని తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

ఏలూరు(మెట్రో): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ఆమె స్థానిక తన కార్యాలయంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంచి నీటి చెరువులకు కాలువల నుంచి నీటిని పూర్తి స్థాయిలో నింపుకొనే విధంగా ప్రత్యేక సూచనలు చేయాలని అన్నారు. ఇప్పటికే కార్యదర్శులకు అదేశాలు ఇచ్చామని డీపీఓ తెలిపారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పద్మశ్రీ ఆదేశించారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత


కారుణ్యనియామక పత్రాలను అందిస్తున్న ఎస్పీ

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సోమవారం అందజేశారు. సేలం దుర్గాప్రసాద్ భార్య దుర్గకు, పెదపాటి సత్యనారాయణ భార్య పి.అనితకు, వీఎంఎం కిషోర్‌బాబు కుమారుడు నిఖిల్ సాయికుమార్‌లకు హోంగార్డ్ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి జిల్లా పోలీస్ యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

సుస్థిరాభివృద్ధిలో సొసైటీల పాత్ర కీలకం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి. చిత్రంలో జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): దేశ సుస్థిర అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర కీలకమని, సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతాని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరం ప్రకటించిందన్నారు. సొసైటీల ద్వారా గ్రామాల్లో ప్రజలకు స్థిరమైన జీవనోపాధి సృష్టి, వారి ఆర్థికాభివృద్ధికి కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ అంశంపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు ర్యాలీలు, సమావేశాలు, మారథాన్‌లు నిర్వహించాలన్నారు. జిల్లాలో 2025 సంవత్సరంలో నెలలవారీగా చేయాల్సిన పనులపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. సహకార వ్యవస్థ ద్వారా జరిగే సమాజాభివృద్ధిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ వరకూ ప్రతి నెలా నిర్వహించే కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సహకార సంవత్సరం థీమ్ లోగోను కలెక్టర్ విడుదల చేశారు. సమావేశంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలని, వ్యసనాలకు బానిసకాకుండా చదువు అనే ఆయుధాన్ని ఉపయోగించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సూచించారు. సోమవారం స్థానిక సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కళాశాల 80వ వార్షికోత్సవంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు స్వీయ క్రమశిక్షణలతో జీవితాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు. సీఆర్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షుడు అల్లూరి ఇంద్ర కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్నత శిఖరాలను అధిరోహించడం సంతృప్తిగా ఉందన్నారు. విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ దాతల విరాళాలతో స్థాపించిన తమ కళాశాల పేదల విద్యాభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు. కరస్పాండెంట్ కేఏస్ విష్ణుమోహన్ మాట్లాడుతూ అల్లూరి బాపినీడు రెడ్డి విద్యాసంస్థలకు అందించిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపాల్ కేఏ రామరాజు 2023–24 విద్యాసంవత్సరంలో కళాశాల సాధించిన ప్రగతిని వార్షిక నివేదికను వివరించారు. అల్లూరి బాపినీడు జయంతిని పురస్కరించుకొని కెమిస్ట్రీ విభాగం లెక్చరర్ కె.జోహార్, జువాలజీ లెక్చరర్ జి.సురేష్ బాబులను అల్లూరి బాపినీడు ఎకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డులతో, ముఖ్యఅతిథి ఎస్పీని ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్లు వీవీ బాల కృష్ణారావు, ఏవీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీలు కొడాలి వెంకట సుబ్బారావు, వల్లభనేని శ్రీ కృష్ణ, కోశాధికారి చిట్టూరి జానికిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత


ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌కు డ్రోన్ అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (టూటౌన్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్న జిల్లా పోలీస్ యంత్రాంగానికి కోకో కోల బాటిలింగ్ యూనిట్ యాజమాన్యం డ్రోన్‌ను సోమవారం ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ చాంబర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రత పరిరక్షణకు పోలీసులు అహర్నిశలు సేవలందిస్తున్నారని చెప్పారు. డ్రోన్‌ను అందజేతకు కృషి చేసిన డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, భీమడోలు సీఐ, సహకరించిన అధికారులను అభినందించారు. ట్రాఫిక్ పర్యవేక్షణ, గస్తీ, అత్యవసర పరిస్థితుల్లో డ్రోన్ సహాయపడుతుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, సీఐ యూజే విల్సన్, ఎస్సై సుధీర్‌బాబు, కోకో కోలా బాటిలింగ్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	36–40	బీన్స్‌చిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	28	కంద	76
కాకర కాయలు	36–40	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	40	కీరా దోస	36
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	68
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	34	చుక్కకూర	10
గోరుచిక్కుడు	38	గోంగూర	07–10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ


బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	20.15	4802	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

పి-4 వాల్ పోస్టర్ విడుదల


పి-4 వాల్ పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్

ఏలూరు(మెట్రో): జీరో పావర్టీ పి-4 వాల్ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. సమగ్రాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణాంధ్ర–2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పి-4 విధానం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. పి-4 విధానంలో ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటి అభివృద్ధి, ప్రతి గ్రామానికి ప్రగతి కల్పనకు సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి టాప్ 10 శాతం తెలుగు ప్రవాసులను, అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించినట్టు చెప్పారు. ఈనెల 25లోపు వెబ్ సైట్లో ప్రజలు తమ అభిప్రాయాలు తెలుపవచ్చన్నారు. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, సీపీఓ వాసుదేవరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, ఎస్ఓ జె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న స్కూల్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీఆర్ రెడ్డి విద్యా సంస్థల మాజీ అధినేత, విద్యాదాత అల్లూరి బాపినీడు జయంతి సందర్భంగా సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సోమవారం నగరంలోని విహాస్ చారిటబుల్ ట్రస్ట్‌కు నిత్యావసర సరకులను అందించారు. ప్రిన్సిపాల్ సాయి కుమారి శంకర్, కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఏలూరు (టూటౌన్): మధ్యవర్తిత్వం ద్వారా కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.సునీల్ కుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపిక చేసిన న్యాయవాదులకు ఐదు రోజుల పాటు మధ్యవర్తిత్వంపై శిక్షణా తరగతులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చక్కటి మార్గమని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా న్యాయవాదులు నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకొని కక్షిదారులకు సేవ చేయాలని కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఏలూరు(మెట్రో): మిషన్ వాత్సల్య పథకం అమలుకు అధికారులు మరింత సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం జిల్లా బాలల సంక్షేమం, రక్షణ కమిటీ సమావేశంలో మిషన్ వాత్సల్య కార్యక్రమ అమలుపై పోక్సో కోర్ట్ జడ్జి ఎస్ ఉమాసునందతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. నిరాధారణకు గురైన బాలలకు రక్షణ కల్పించి, మిషన్ వాత్సల్య ద్వారా విద్యా, ఆరోగ్యం అందించి సమాజంలో వారిని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలు, బాల్య కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు, హక్కుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 69, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 64 బాల్య వివాహాల నుంచి బాధితులను రక్షించి పునరావాస కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పోక్సో చట్టం కింద 2012 నుంచి ఇప్పటి వరకు 1,144 కేసులు నమోదు చేశామని, 2024 సంవత్సరంలో 148 కేసులు నమోదు చేసి 66 మందికి పరిహారం అందించామని, 139 మందికి విద్య అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. పోక్సో కోర్ట్ జడ్జి ఎస్ ఉమాసునంద మాట్లాడుతూ పోక్సో కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, జిల్లా పరిషత్ సీఈఓ భీమేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీనివాస్, డీసీపీఓ సీహెచ్ సూర్య చక్రవేణి, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, సభ్యులు కెల్లా హైమావతి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రయాణికులను గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చడంలో డ్రైవర్ల పాత్ర కీలకమని మోటార్ వాహనాల తనిఖీ అధికారి పి.రమేష్ బాబు అన్నారు. సోమవారం నగరంలోని ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో రహదారి భద్రత నియమాలను పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. 40 ఏళ్ల వయసు దాటిన ప్రతి డ్రైవర్ తప్పకుండా ఎప్పటికప్పుడు కంటి, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మనం సవ్యంగా డ్రైవ్ చేసినప్పటికీ ఎదుటి వారివల్లా ప్రమాదాలు సంభవిస్తుంటాయని, దానికి తగ్గట్టుగా ప్రతి చాకచక్యంగా ప్రమాదాన్ని తప్పించగలిగే నైపుణ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు ఎస్ జగదీష్ బాబు, పి.నరేంద్ర బాబు పాల్గొన్నారు.